క్లుప్తంగా

ఘనంగా గంగాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


గంగాలమ్మ అమ్మవారి నూతన విగ్రహం

గోకవరం: గ్రామ శివారున రాజమహేంద్రవరం వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన గంగాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

సకాలంలో విద్యాకానుకలిస్తాం


రంగంపేటలో జగనన్న విద్యా కానుకలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్ఎస్ఏ ఎంఈ గౌరీశంకర్

రంగంపేట: ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ సకాలంలో జగనన్న విద్యా కానుకలు అందించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్ఎస్ఏ ఎంఈ గౌరీశంకర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన జగనన్న కానుక పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేశారు. జగనన్న విద్యా కానుకలో పాఠ్య పుస్తకాలు, నిఘంటువులు, బ్యాగులు, బెల్టులు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, బూట్లు తదితర సామగ్రిని జూన్ మొదటి వారంలోనే పాఠశాలలకు చేరుస్తామన్నారు. ఇంకా బ్యాగులు రావాల్సి ఉందని, అవి వచ్చిన వెంటనే కిట్లుగా తయారుచేసి అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలోని ఎంఈఓ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఐఈ కోఆర్డినేటర్ కన్నబాబు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరజ్ఞానంతో బంగారు భవితకు బాట


రంగంపేట శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట: అక్షర జ్ఞానంతో విద్యార్థుల బంగారు భవితకు బాట ఏర్పరచుకోవాలని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. బుధవారం రంగంపేట శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయడానికి వేసవి శిక్షణ తరగతులు దోహద పడతాయన్నారు. శిబిరంలో విద్యార్థులకు సరస్వతీదేవి ప్రార్థన, యోగాసనాలు, సూర్య నమస్కారాలు, నీతి కథలపై పోటీలు నిర్వహించారు.

ఆర్టీసీ స్థలం లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట: మండలంలోని బీపీసీఎల్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న ఆర్టీసీ ఖాళీ స్థలంలో వ్యాపార నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్లు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్‌కే షబ్బుం తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 8వ తేదీ వరకూ టెండర్ల కోసం దరఖాస్తులిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆర్టీసీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.


పొగాకు ఉత్పత్తులతో నోటి క్యాన్సర్


ఇటికాయలపల్లిలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: పొగాకు ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా నోటి క్యాన్సర్‌కి గురయ్యే ప్రమాదం ఉందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు అన్నారు. మండలంలోని ఇటికాయలపల్లిలో బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, క్షయ వంటి వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిరస్తు

- అవకాశాలను అందుకునేందుకు శిక్షణ
- నిరుద్యోగులకు సదవకాశం
- నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ హబ్‌లు


రాజానగరం స్కిల్ హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటింగ్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

రాజానగరం: నైపుణ్యం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు... అందరిలో ప్రత్యేకత చాటవచ్చు.. చదువుకుని తగిన ఉపాధి పొందలేని యువత అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోంది.. వారిలో నైపుణ్యాలను పెంపొందించడానికి చర్యలు చేపట్టింది.. తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని భావించింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను, జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజీని ఏర్పాటు చేసి, నిరుద్యోగ సమస్య నివారణకు కృషి చేస్తుంది. 8వ తరగతి చదివిన అభ్యర్థుల నుంచి బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన అభ్యర్థుల వరకూ, వారి ఆసక్తిని బట్టి నిర్ణయించిన కోర్సుల్లో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు జారీ చేస్తుంది. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్కిల్ కాలేజీని బొమ్మూరులో ఏర్పాటు చేయగా స్కిల్ హబ్‌లను అసెంబ్లీ నియోజవర్గాల వారీగా నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు, రాజహేంద్రవరం రూరల్, అర్బన్, అనపర్తి, రాజానగరంలలో నిర్వహిస్తున్నారు.

కోర్సులు ఇవీ...

18 నుంచి 35 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సులలో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇస్తున్నారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత గలవారికి టైలరింగ్, ఎలక్ట్రికల్ డొమెస్టిక్ సొల్యూషన్స్, అసిస్టెంట్ డెకరేటివ్ పెయింటర్ తదితర కోర్సుల్లో, ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉన్నవారికి డేటా ఎంట్రీ ఆపరేటింగ్, జావా, ఎంఎస్ఎస్ ఆఫీస్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, ఎలక్ట్రీషియన్ వర్క్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, హోమ్ హెల్త్ ఎయిడ్ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ తదితర కోర్సులలో నిర్ణీత కాలం పాటు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ సమయంలో క్యాంపస్ సెలక్షన్లు ఎక్కడైనా జరుగుతుంటే అర్హత, ఆసక్తి ఉన్నవారిని పంపించి, ఉద్యోగాలు అందుకునే విధంగా తోడ్పాటు ఇస్తున్నారు. కోర్సును బట్టి కాలవ్యవధి ఉంటుంది. స్కిల్ హబ్‌లో రోజుకు 4–5 గంటలు, స్కిల్ కాలేజీలో 8 గంటల పాటు శిక్షణ ఇస్తున్నారు.


టైలరింగ్‌లో మొదటి బ్యాచ్‌కు శిక్షణ

రెండు నెలల శిక్షణ



రాజానగరం కామన్ ప్రొడక్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.కొండలరావు పర్యవేక్షణలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. జనవరిలో ప్రారంభమైన ఈ సెంటర్‌లో ఇంతవరకూ టైలరింగ్‌లో 30 మందికి ఎం.శాంతకుమారి ట్రైనర్‌గా రెండున్నర నెలల పాటు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం మరో 30 మందికి డేటా ఎంట్రీ ఆపరేటింగ్‌లో శిక్షణ ఇస్తున్నాం. శిక్షకురాలిగా సీహెచ్ నాగలక్ష్మి వ్యవహరిస్తున్నారు.

– టీఎస్ గణేష్‌కుమార్, స్కిల్ హబ్ ఇన్‌చార్జి, రాజానగరం

పరిజ్ఞానం అవసరం



నేను బీఎస్సీ కంప్యూటర్స్ చదివాను. కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఈ సమయంలో డేటా ఎంట్రీ ఆపరేటింగ్, ఎక్సెల్‌లో రెండు నెలల శిక్షణ ఇస్తున్నారని తెలిసి చేరాను. ప్రస్తుతం అంతా కంప్యూటర్ మయమైన తరుణంలో ఏ జాబ్ చేయాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం. అందుకే ఇక్కడ శిక్షణ పొందుతున్నా.

– ఉప్పా పుష్ప, అభ్యాసకురాలు, రాజానగరం

నేడు ధ్వజస్తంభం ప్రతిష్ఠ


జి.మామిడాడలో ధ్వజ స్తంభాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ శ్రీ ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి వారి ఆలయంలో నూతన ధ్వజ స్తంభం ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో బుధవారం నూతన ధ్వజ స్తంభ ఊరేగింపు మహోత్సవం ఘనంగా జరిపారు. భక్తులు ధ్వజ స్తంభానికి మంగళ హారతులు, పసుపునీళ్లు సమర్పించి స్వామి అనుగ్రహం పొందారు. గ్రామం హరినామ స్మరణతో మారుమోగింది. కార్యక్రమానికి వందల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం


బలభద్రపురంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. బుధవారం ఏకాదశిని పురస్కరించుకుని అర్చకులు పెద్దింటి రామగోపాలాచార్యులు, వేదాంతం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అందరికీ ఆసరా

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రాజా


అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆసరా పథకంలో సొమ్ము జమ కాకుంటే ఆందోళన చెందవద్దని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా భరోసా ఇచ్చారు. కోరుకొండ మండలం నిడిగట్లకు చెందిన పవనీ గ్రూపు సభ్యులు రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే రాజాను కలుసుకుని ఆసరా పథకంలో తమ గ్రూపు సభ్యులకు బ్యాంకు ఖాతాలలో నగదు జమ కాలేదని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసిన ఎమ్మెల్యే ఆసరా సాయం జమ కాకపోవడానికి కారణాలేంటని ఆరా తీశారు. సాంకేతిక కారణాలతో ఈ విధంగా జరిగిందని, ఇటువంటి వారి వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారన్నారు. విజయవాడలోని సెర్ప్ సీఈఓను కలుసుకుని కూడా ఈ విషయమై మాట్లాడతానని, ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

పట్టుదలతో శ్రమిస్తే అద్భుత విజయాలు


ఈలకొలనులో మాట్లాడుతున్న సమన్వయకర్త ఎస్‌వీ సాయిరాం

రంగంపేట: కృషి, పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే అద్భుత విజయాలు సాధించొచ్చని శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎస్‌వీ సాయిరాం అన్నారు. బుధవారం ఆయన ఈలకొలను గ్రామంలోని వేసవి వెన్నెల శిక్షణ తరగతుల్లో భాగంగా విజయం సాధించడం ఎలా అనే అంశంపై ప్రసంగించారు. కాలాన్ని, శక్తిని, మేధస్సును సమయానుకూలంగా సద్వినియోగం చేసుకుంటే విజయాలు ఎలా సాధించొచ్చో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సెల్ ఫోన్, సినిమా, టీవీలకు బానిసలై యువత తమ జీవన లక్ష్యంలో ఎలా వెనకబడిపోతున్నారో అవగాహన కల్పించారు. రంగంపేట సత్యసాయి మందిరంలో వేసవి వెన్నల కార్యక్రమాల్లో రామాయణంలో ఆదర్శపాత్రలు, నిజమైన మిత్రుడు అనే అంశంపై జిల్లా విద్యా విభాగం సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు వివరించారు. కార్యక్రమంలో ప్రశాంతి సేవల జిల్లా ఇన్‌చార్జి టి.గోవిందురాజులు, సేవా సమితి కన్వీనర్ టి.సుబ్బారావు, టి.సత్యనారాయణ, భవానీ, ఎల్ఎస్ఎస్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీ స్కీమ్ తొలి చైర్మన్ మృతి

సీతానగరం: పురుషోత్తపట్నంలో తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ తొలి చైర్మన్ చినకొండేపూడికి చెందిన శ్రీమండపాటి సత్యనారాయణ రాజు (86) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. సాగునీటి సంఘాలు తీసుకువచ్చిన సమయంలో టీపీ స్కీమ్‌కు తొలి చైర్మన్‌గా సేవలు అందించారు. అలాగే పీఏసీఎస్ అధ్యక్షుడిగా పదేళ్ల పనిచేసి సంఘాన్ని బలోపేతం చేశారు. ఈయనకు ముగ్గురు కుమారులలో జగపతి రామకృష్ణంరాజు, కృష్ణబాబు ఉన్నారు. పార్టీలకతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు వెళ్లి సంతాపం వ్యక్తం చేశారు.

లారీ డ్రైవర్ మృతి

సీతానగరం: మండలంలోని రామచంద్రపురంలో ఏలూరుకు చెందిన లారీ డ్రైవర్ అల్లం లీలాకుమార్ (52) గుండెపోటుతో మరణించాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. ఏలూరు నుంచి పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురంలోని పీఏసీఎస్‌కు విత్తనాల లోడుతో వచ్చిన లారీ అన్‌లోడ్ అయిన అనంతరం పక్కగా పార్క్ చేసిన డ్రైవర్ లీలాకుమార్‌కు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. స్థానికులు గ్రామంలోని వైద్యుని తీసుకురాగా అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించగా, మృతుని కుమారునికి సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


సిద్ధి వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


కూనవరంలో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: కొత్తతుంగపాడులో సుమారు రూ.కోటితో కొత్తగా నిర్మించిన సిద్ధి వినాయకుని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ పూజల్లో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిద్ధివినాయక స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

సీతానగరం: కూనవరం గ్రామ సచివాలయం పక్కన కొత్తగా నిర్మించిన గీతా మందిరం కృష్ణాలయాన్ని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణ పరమాత్మునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.30 లక్షలతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో గీతా మందిరాన్ని నిర్మించారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీటీసీ నల్లమోలు భాస్కరరావు, నాయకులు సుంకర నరసింహారావు, ఆలయ చైర్మన్ గంగరాజు, చొటిపల్లి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేత వెదురుపాక టీమ్


ట్రోఫీ గెలుచుకున్న వెదురుపాక టీమ్

బిక్కవోలు: మండలంలోని మెల్లూరులో గత పదిరోజులుగా మెల్లూరు క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న దూళ్ల శివశంకర్ స్మారక టోర్నమెంట్ టైటిల్‌ను వెదురుపాక టీమ్ గెలుచుకుంది. టోర్నమెంట్‌లో మొత్తం 12 టీమ్‌లు పాల్గొనగా బుధవారం నిర్వహించిన ఫైనల్‌లో వెదురుపాక, మెల్లూరు టీమ్‌లు పోటీ పడ్డాయి. విజేతగా వెదురుపాక, రన్నర్‌గా మెల్లూరు టీమ్ నిలిచాయి. అనంతర విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దిరెడ్డి సాయిరాం, ఉప సర్పంచ్ కొమ్మన ఆనంద్, సొసైటీ అధ్యక్షుడు ఓసీ సత్యనారాయణ, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ


ఒలింపియాడ్ ఉమ్మడి జిల్లాల బాక్సింగ్ సెలక్షన్స్‌లో రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాజమహేంద్రవరం రూరల్: శివకోడులో ఇటీవల జరిగిన 12వ జిల్లా స్థాయి మినీ ఒలింపియాడ్ ఉమ్మడి జిల్లాల బాక్సింగ్ జూనియర్స్, యూత్, సీనియర్స్ విభాగాల సెలక్షన్స్‌లో బొమ్మూరు గ్రామానికి చెందిన శ్రీమారుతి సెల్ఫ్ డిఫెన్స్ క్రీడాకారులు రాణించారు. మహిళల విభాగం వివిధ అంశాల్లో కె.రేఖాఅన్నీల, జి.అక్షిత, వి.హర్షిణి, ఎస్ఎస్‌కే ప్రకృతి, షేక్ రెహానా, డి.వేణుప్రియాంక స్వర్ణ పతకాలు సాధించారు. కె.సింధు, షేక్‌సనా, కె.నాగదుర్గశ్రీ, పి.నాగప్రణీత, టి.తేజశ్విని రజిత పతకాలు పొందారు. పురుషుల విభాగంలో కె.కేశవగంగాధర్, కె.కార్తికేయ, ఎస్.జశ్వంత్, కె.ఉమామహేశ్వర్, డి.అఖిలేష్ నారాయణ, పీజే అభినవ్, బి.శివ, టి.సాత్విక్, పి.యశ్వంత్, ఎం.పార్థసారధి, ఎస్.రుత్విక్‌వీరసాగర్, ఎస్.మోహన్, బి.అజయ్ స్వర్ణ పతకాలు సాధించారు. కె.చంద్రకార్తీక్, కె.సన్‌తీకిరణ్, కె.అగ్రితీశ్వర్, యు.యశ్వంత్, బి.అర్జున్ రజిత పతకాలను గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను, కోచ్‌లు మేకా గణేష్, ఎం.భవానీశంకర్, ఎస్.గిరివెంకట రమణలను బాక్సింగ్ జిల్లా సెక్రటరీ సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా ఒలింపిక్ సెక్రటరీ పద్మనాభం ప్రత్యేకంగా అభినందించారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

సీతానగరం: సింగవరం ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు బుధవారం తెలిపారు. తెల్లవారు జామున సీతానగరానికి చెందిన దొమ్మేటి సూరిబాబు ట్రాక్టర్‌పై ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ పట్టుకున్నారన్నారు. ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారన్నారు.

గాయపరిచిన భర్తపై కేసు

బిక్కవోలు: విడాకులు ఇవ్వాలంటూ భార్యను గాయపరిచిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం బిక్కవోలు గ్రామానికి చెందిన రామదుర్గకు అడపా సాయితేజతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్లుగా సాయితేజ తరచూ రామదుర్గతో గొడవపడేవాడు. ఈ నెల 30వ తేదీ రాత్రి విడాకులు ఇస్తావా లేదా అంటూ రామదుర్గను కొట్టి గాయపరచడంతో ఆమె అనపర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో ప్రశంస


జాతీయ వర్క్‌షాప్‌లో ప్రశంసాపత్రం అందుకుంటున్న కృష్ణమోహన్

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వరహాగిరి కృష్ణమోహన్ జాతీయ స్థాయిలో జరిగిన వర్క్‌షాప్‌లో ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ వివరాలను బుధవారం ఆయన తెలిపారు. ఢిల్లీలో జరిగిన డీడీఆర్ (డిస్ట్రిక్ట్ డిజిటల్ రేపాజిటరీ) వర్క్‌షాప్‌లో సీసీఆర్‌టీ చైర్మన్ హిందుల్కర్, డైరెక్టర్ రిషి వశిష్ట, డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ కుమార్ చేతుల మీదుగా ఆయన ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలో పలు రాష్ట్రాల నుంచి పలువురు ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ఫ్రీడమ్ పార్క్‌లో స్వాతంత్ర్య సమరయోధుల కథలు, తామ్ర పత్రాలు మొదలైన అంశాలు ఆయన సమర్పించారు. దీంతో ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లాలో 159 మంది స్వాతంత్ర్య సమర యోధులున్నట్లు కృష్ణమోహన్ తెలిపారు. ఇవన్నీ డీడీఆర్‌లో నిక్షిప్తం చేయడంలో ఆంధ్రప్రదేశ్ 560 కథలతో ద్వితీయ స్థానంలో ఉందన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం


విద్యపై అవగాహన కల్పిస్తూ దళిత నాయకుల ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని దళిత గిరిజన సంఘాల నాయకులు అన్నారు. బుధవారం స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించినట్లే ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పేద బాల బాలికలను ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చేర్పించాలని అన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ అధినేత కొల్లి వెంకటరమణ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరం నుంచి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరారు. మూడో తరగతి నుంచి పీజీ వరకు పేద బాల బాలికలకు రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్ సదుపాయం కల్పించిందన్నారు. అందుకే ఆ విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బాల కార్మికులు లేని సమాజం కోసం అంబేడ్కర్ కలలు కన్నారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. నాయకులు తాళ్లూరి బాబూరాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, పాము బాబూరావు, కప్పల వెలుగుకుమారి, అద్దా కుమార్‌బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

రంగంపేట: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని దొడ్డిగుంట గ్రామానికి చెందిన దూళ్ళ సుమలతకు 11 ఏళ్ళ కిత్రం ప్రసాద్‌తో వివాహమైందన్నారు. వివాహ సమయంలో రూ.2 లక్షలు కట్నం ఇచ్చారన్నారు. గత కొంతకాలంగా అదనపు కట్నం కావాలంటూ తన భర్త ప్రసాద్‌తో పాటు అత్తమామలు, ఆడపడుచు, ఆడపడుచు భర్త వేధిస్తున్నారని, గత నెల 24వ తేదీన కట్నం తీసుకురమ్మని ఇంటి నుంచి గెంటేశారని సుమలత ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు


పురస్కారాలు పొందిన వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే వారధులు వలంటీర్లేనని 36వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నందం స్వామి అన్నారు. బుధవారం స్థానిక 63వ సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉత్తమ వలంటీర్లను సేవా పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను కొనియాడారు. సచివాలయ ఇన్‌చార్జి, సిబ్బంది, వార్డు వలంటీర్లు, కన్వీనర్లు గోవాడ వెంకటేశ్వరరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి ఎదగాలి

ప్రకాశంనగర్: క్రీడాకారులు ఉన్నత స్థితికి ఎదగాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణ ఆకాంక్షించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మూడు వారాల పాటు స్థానిక ఆర్ట్స్ కళాశాల టెన్నిస్ కోర్టులో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. శిక్షణ పొందిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మాధవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు భార్గవ్, కోచ్ ప్రకాష్ పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న 10 మంది అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు లారీ, మూడు వ్యాన్‌లలో పశువులను తరలిస్తున్న 10 మందిని బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు అరెస్టు చేశారు. లారీ, వ్యాన్‌లలో 46 ఆవులు, 13 గేదెలు, 57 ఎద్దులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సమయంలో దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు, సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఇందులో 116 పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న అభియోగంపై 10 మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పశువులను శ్రీకృష్ణపట్నంలోని గోశాలకు తరలించారు.

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు

సీటీఆర్ఐ: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలలో 550 మార్కులు దాటిన శెట్టిబలిజ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తామని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాసపోయిన రామారావు అన్నారు. బుధవారం స్థానిక తిలక్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007వ సంవత్సరం నుంచి నిర్విరామంగా మెరిట్ స్కాలర్‌షిప్‌లు తమ సంఘం విద్యార్థులకు అందజేస్తుందన్నారు. ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.